కాంగ్రెస్ పార్టీకి షాక్

- ఎల్లారెడ్డి మున్సిపాలిటీలో నెగ్గిన అవిశ్వాసం
- బీఆర్ఎస్‌తోపాటు అధికార పార్టీ నేతల మద్దతు
- పదవీచ్యుతుడైన చైర్మన్ సత్యనారాయణ

ఎల్లారెడ్డి రూరల్, జూలై 9: కాంగ్రెస్ పార్టీకి ఎదురుదెబ్బ తగిలింది. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మున్సిపాలిటీలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. గతంలో బీఆర్ఎస్ తరఫున గెలిచి చైర్మన్‌గా ఎన్నికైన సత్యనారాయణ.. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో పార్టీ ఫిరాయించి కాంగ్రెస్‌లో చేరారు. దీంతో ఆయనపై బీఆర్ఎస్ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం నోటీసు ఇవ్వగా.. మే 18న ఆర్డీవో మన్నె ప్రభాకర్ మున్సిపల్ సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్‌కు చెందిన ఎనిమిది మంది, కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరు సభ్యులు తీర్మానానికి మద్దతుగా చేతులెత్తారు. చైర్మన్ సత్యనారాయణ హైకోర్టుకు వెళ్లి అవిశ్వాసంపై ఫలితం ప్రకటించకుండా స్టే తెచ్చుకోవడం, అదే సమయంలో పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో ఆ రోజు ఫలితం ప్రకటించలేదు. రెండ్రోజుల క్రితం హైకోర్టు స్టే ఎత్తేయడంతో ఆర్డీవో మంగళవారం ఫలితం ప్రకటించారు. అవిశ్వాస తీర్మానం నెగ్గిందని, చైర్మన్ సత్యనారాయణ పదవీచ్యుతుడయ్యారని తెలిపారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రతినిధులు కలిసి ప్రవేశపెట్టిన అవిశ్వాసం నెగ్గడం చర్చనీయాంశమైంది.

వీఆర్వో వ్యవస్థను పునరుద్ధరించాలి

రేవంత్‌కు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి లేఖ

జగిత్యాల, జూలై 9: ప్రభుత్వ పథకాలను అమలు చేయడంలో కీలకపాత్ర పోషించే వీఆర్వో వ్యవస్థను ప్రభుత్వం వెంటనే పునరుద్ధరించాలని కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కోరారు. మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖను పంపారు. గతంలో గ్రామ రెవెన్యూ అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ.. ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో అర్హులైన వారికి అందించడంతోపాటు భూ సమస్యల పరిష్కారంలో కీలకపాత్ర పోషించారని గుర్తుచేశారు. వీఆర్వోల వ్యవస్థను పునరుద్ధరించి, రెవెన్యూ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టాలని కోరారు.

మంత్రి గారి అలక!

- బల్కంపేట ఎల్లమ్మ సాక్షిగా ప్రొటోకాల్ రచ్చ
- వీఐపీ లైన్‌లోకి భక్తులు
- తోపులాటలో మేయర్.. మంత్రి పొన్నంకు గాయాలంటూ వైరల్
- పట్టు వస్త్రాలతోనే బైఠాయింపు
- తోపులాటలో కుట్రకోణం: మంత్రి కొండా సురేఖ

రోడ్డు డివైడర్‌పై బైఠాయించిన మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్/హైదరాబాద్ సిటీబ్యూరో జూలై 9 (నమస్తే తెలంగాణ), అమీర్‌పేట్: బల్కంపేట ఎల్లమ్మ సాక్షిగా ప్రొటోకాల్ వివాదం అగ్గి రాజేసింది. మంగళవారం ఎల్లమ్మ కల్యాణ మహోత్సవానికి కుటుంబసభ్యులతో కలిసి వచ్చిన రవాణాశాఖ మంత్రి, హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు ఉన్నతాధికారులు స్వాగతం పలకలేదు. ఆ సమయంలో కల్యాణ టికెట్లు ఉన్న భక్తులు పెద్ద సంఖ్యలో గుమిగూడటంతో మంత్రి, మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని లోపలికి తీసుకెళ్లేందుకు పోలీసులు బారికేడ్లు తెరిచారు. దీంతో ఒక్కసారిగా భక్తులు లోపలికి దూసుకెళ్లే ప్రయత్నం చేశారు. ఈ తోపులాటలో మంత్రి పొన్నం కుదుపునకు గురి కాగా, మేయర్ కింద పడిపోయారు. తనకు ఎదురైన చేదు అనుభవంతో అసహనానికి గురైన మంత్రి.. అక్కడ ఉన్న పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ పక్కనే ఉన్న రోడ్డు డివైడర్‌పై కూర్చుండిపోయారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి హుటాహుటిన మంత్రి వద్దకు వచ్చి సముదాయించి ఆలయం లోపలికి తీసుకెళ్లారు. మంత్రి పొన్నం రాకముందే.. దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ కల్యాణోత్సవానికి వచ్చారు. ఆమెకు దేవాదాయశాఖ కమిషనర్ హనుమంతరావు, కలెక్టర్, పోలీసు అధికారులు స్వాగతం పలికి అమ్మవారి దర్శనానికి తీసుకెళ్లారు. కొద్దిసేపటికే కుటుంబసభ్యులతో మంత్రి పొన్నం కూడా రావటంతో ఆయనకు స్వాగతం పలికేందుకు అక్కడ ఎవ్వరూ అందుబాటులో లేరు.

మంత్రి అలిగారంటూ పోస్టులు

ఆలయం వద్ద అధికారులు ప్రొటోకాల్ పాటించకపోవటంతో మంత్రి అలిగారు అంటూ సోషల్ మీడియాలో పోస్టులు వైరల్ అయ్యాయి. పోలీస్ ఉన్నతాధికారులకు ఫోన్ చేసినా వారు స్పందించలేదనే ఆరోపణలు వచ్చాయి. దీనిపై మంత్రి పొన్నం ప్రభాకర్‌తో 'నమస్తే తెలంగాణ' మాట్లాడగా.. అలాంటిదేమీ లేదని, అక్కడ జరిగిందొక్కటి, సోషల్‌మీడియాలో వస్తున్నదొకటని ఖండించారు. తోపులాట జరగటంతో పరిస్థితిని చక్కదిద్దేందుకు పక్కకు వచ్చామని తెలిపారు. పోలీసులతో మాట్లాడి భక్తులకు ఇబ్బందులు లేకుండా చేసే ప్రయత్నం చేశానని వెల్లడించారు. దీనికే తాను అలిగానని ట్రోల్ చేశారని చెప్పారు.

తోపులాట వెనుక కుట్ర కోణం: కొండా సురేఖ

దేవాలయంలో తోపులాట వెనుక కుట్ర కోణం దాగున్నదని దేవాదాయ ధర్మాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ దేవాలయానికి వచ్చిన సందర్భంలో కొందరు రాజకీయ ప్రేరేపిత అల్లరి మూకలు కావాలని తోపులాటకు దిగి శాంతిభద్రతల సమస్య తలెత్తేలా కుట్రకు పాల్పడ్డారని తెలిపారు. పోలీస్‌శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరించిందని వ్యాఖ్యానించారు. ఘటనపై సచివాలయంలో మంత్రులు సురేఖ, పొన్నం ప్రభాకర్ అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. ఓ మహిళా జర్నలిస్టును డ్యూటీలో ఉన్న ఎస్సై దుర్భాషలాడిన విషయం తన దృష్టికి వచ్చిందని, విచారణ చేపట్టి సంబంధిత అధికారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను మంత్రి సురేఖ ఆదేశించారు.

కాగా, తన వ్యక్తిగత ప్రతిష్ఠను దిగజార్చేలా సోషల్‌మీడియాలో అసభ్యకర వీడియోలు పోస్ట్ చేశారని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సీసీఎస్ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

హెయిర్ కటింగ్ దుకాణాలకు వచ్చిన కరెంట్ బిల్లులతో యజమానులు

సెలూన్లకు కరెంటు బిల్లు

- కేసీఆర్ ఫ్రీ కరెంటు ఇస్తే.. కాంగ్రెస్ బిల్లు కట్టమంటున్నది
- నాయీబ్రాహ్మణ సంఘం రాష్ట్ర కార్యదర్శి పరమేశ్
- కరెంటు బిల్లులతో సెలూన్ల యజమానుల ఆందోళన

పెబ్బేరు, జూలై 9: కేసీఆర్ ప్రభుత్వం 2021లో హెయిర్ కటింగ్ సెలూన్లు, ల్యాండ్రీ షాపులకు ప్రతి నెలా ఉచిత విద్యుత్తును అందించి ప్రోత్సహిస్తే.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం బిల్లులు కట్టాల్సిందేనంటూ ఒత్తిడి తెస్తున్నదని నాయీబ్రాహ్మణ సంఘం రాష్ట్ర కార్యదర్శి పరమేశ్‌నాయి విమర్శించారు. మంగళవారం వనపర్తి జిల్లా పెబ్బేరులో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. వారికి వచ్చిన కరెంట్ బిల్లులను చూపించి ఆవేదన వ్యక్తంచేశారు. ఏడు నెలల కిందటి వరకు తమ షాపులకు జీరో బిల్లులు వచ్చాయని, ఇప్పుడు రూ.వందల్లో బిల్లులు వస్తున్నాయని వాపోయారు. ప్రస్తుత సర్కారు కూడా ఉచిత విద్యుత్తును అమలు చేసి బిల్లులు రాకుండా చూడాలని కోరారు. ఈ సమావేశంలో సెలూన్ల యజమానులు బాలకృష్ణ, శంకర్, భాస్కర్, ఎల్లయ్య, బాలరాజు, కృష్ణ, శ్రీనివాసులు, సత్యన్న, వరదరాజు, మంజునాథ్, వీరస్వామి, బాలు, లక్ష్మన్న, బాబు తదితరులు పాల్గొన్నారు.

సెలూన్లకు సబ్సిడీ విద్యుత్‌పై ఆంక్షలు లేవు: ఎస్పీడీసీఎల్

హైదరాబాద్, జూలై 9 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని సెలూన్లకు 250 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌పై ఎలాంటి ఆంక్షలు విధించలేదని ఎస్పీడీసీఎల్ తెలిపింది. 'సెలూన్ల కరెంటుకు సర్కార్ కటింగ్' పేరుతో నమస్తే తెలంగాణలో ప్రచురితమైన కథనానికి స్పందించింది. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 2021 ఏప్రిల్ 4 నుంచి ఈ పథకం అమలవుతున్నట్టు తెలిపింది. సెలూన్లకు ఇచ్చే రాయితీ మొత్తాన్ని ప్రభుత్వం డిస్కంలకు చెల్లిస్తున్నదని, అప్పటి నుంచి ఇప్పటివరకు అదే పద్ధతి కొనసాగుతున్నదని పేర్కొన్నది. అంతకుమించి కరెంటు వాడినవారికి మాత్రమే బిల్లు వస్తున్నదని వెల్లడించింది. బిల్లుల వసూలులో తమ సిబ్బంది ఎవరినీ ఇబ్బంది పెట్టడం లేదని స్పష్టం చేసింది.

రాష్ట్రంలో డీఏపీ కొరత

- ఈ నెల వరకు 1.9 లక్షల టన్నులు అవసరం
- కేంద్రం సరఫరా చేసింది 43 వేల టన్నులే
- ఎరువులు అందక రైతులకు తీవ్ర ఇక్కట్లు
- కొరతపై కేంద్రానికి మంత్రి తుమ్మల లేఖ
- సరఫరా చేస్తామంటూ కేంద్రం హామీ
- ఎప్పుడు సరఫరా చేస్తారో చెప్పని వైనం

హైదరాబాద్, జూలై 9 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో వరి నాట్లు జోరందుకున్న సమయంలో డీఏపీ ఎరువుకు కొరత ఏర్పడింది. దీంతో రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రాష్ట్రంలో డీఏపీ కొరత ఉన్నట్టు వ్యవసాయ శాఖ గణాంకాలే స్పష్టం చేస్తున్నాయి. ఏప్రిల్ నుంచి జూలై వరకు కేంద్రం నుంచి 1.90 లక్షల టన్నుల డీఏపీ రాష్ట్రానికి సరఫరా కావాల్సి ఉన్నది. కానీ ఇప్పటివరకు 43 వేల టన్నుల డీఏపీ మాత్రమే వచ్చినట్టు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఈ నేపథ్యంలో డీఏపీ కొరతను తీర్చేందుకు ఈ నెలలో 80 వేల టన్నులు సరఫరా చేయాలని ఇటీవల కేంద్ర మంత్రి జేపీ నడ్డాకు లేఖ రాశారు. దీంతో రాష్ట్రానికి అవసరమైన డీఏపీతోపాటు అన్ని ఎరువులను సరఫరా చేస్తామని మంగళవారం ఆయన హామీ ఇచ్చినట్టు మంత్రి తుమ్మల వెల్లడించారు. కానీ, ఆ ఎరువులను ఎప్పటిలోగా సరఫరా చేస్తారన్న దానిపై స్పష్టత లేకపోవడంతో రాష్ట్రంలో డీఏపీ కొరత మరింత తీవ్రమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. వాస్తవానికి ఈ వానకాలం సీజన్ కోసం రాష్ట్రానికి కేంద్రం 24.40 లక్షల టన్నుల ఎరువులను (10.40 లక్షల టన్నుల యూరియా, 10 లక్షల టన్నుల ఎన్‌పీకే, 2.40 లక్షల టన్నుల డీఏపీని) కేటాయించింది. దీనిలో భాగంగా ఏప్రిల్‌లో 50 వేల టన్నులు, మే నెలలో 60 వేల టన్నులు, జూన్‌లో 50 వేల టన్నులు, జూలైలో 30 వేల టన్నుల చొప్పున ఇప్పటివరకు మొత్తం 1.90 లక్షల టన్నుల డీఏపీ సరఫరా చేయాల్సి ఉండగా కేవలం 43 వేల టన్నులే వచ్చినట్టు వ్యవసాయ శాఖ వెల్లడించింది.

అవసరమైన ఎరువులు కేటాయిస్తాం :నడ్డా

రాష్ట్రానికి అవసరమైన ఎరువులు కేటాయిస్తామని కేంద్ర రసాయన, ఎరువుల శాఖ మంత్రి జేపీ నడ్డా మంగళవారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు లేఖ రాశారు. రాష్ట్రానికి సరిపడా ఎరువులను కేటాయించడం లేదంటూ జూన్ 19న కేంద్రానికి మంత్రి లేఖ రాశారు. ఏప్రిల్, మే నెలలో 1.12 లక్షల టన్నుల డీఏపీ అవసరం ఉండగా 43వేల టన్నులు మాత్రమే సరఫరా చేశారని, జూలైలో 80వేల టన్నులు సరఫరా చేయాలని కోరారు. దీనిపై స్పందించిన కేంద్ర మంత్రి తిరిగి లేఖ రాశారు. డీఏపీతోపాటు ఇతర ఎరువులనూ సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు.

10 రోజుల్లో దరఖాస్తుల పరిష్కారం

వీసీలో సీఎస్ శాంతికుమారి

హైదరాబాద్, జూలై 9 (నమస్తే తెలంగాణ): ధరణి పెండింగ్ ఫిర్యాదులను 10 రోజుల్లో పరిష్కరించాలని సీఎస్ శాంతికుమారి కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. రాష్ట్రంలోని 25 వేల గ్రామ సమైక్య సంఘాలకు రూ.కోటి చొప్పున ఆర్థిక సహాయం అందజేయాలని సీఎం ఆదేశించారని గుర్తుచేశారు. వనమహోత్సవంలో భాగంగా 20.02 కోట్ల మొక్కలు నాటాలని తెలిపారు. స్వయం సహాయక మహిళలను కోటీశ్వరులు చేయాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్టు వెల్లడించారు. ఇందిరమ్మ క్యాంటీన్‌ల ఏర్పాటుకు చొరవ చూపించాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు 2 వారాల్లో పూర్తికావాలని ఆదేశించారు. 50 లక్షల ఎకరాల్లో వరినాట్లు వేశారని వీటికి సరిపడా యూరియా, ఎరువులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఉద్యోగుల బదిలీలను ఈ నెల 20 లోగా పూర్తి చేయాలని తెలిపారు. ఒక్కో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలకు 20 ఎకరాల భూమిని సేకరించాలని ఆదేశించారు.

సేవాలాల్ బంజారాభవన్ వద్ద ధర్నా చేస్తున్న సీనియర్ ఉపాధ్యాయులు

గురుకుల ఉపాధ్యాయుల మెరుపు ధర్నా

- అర్ధరాత్రి అకస్మాత్తు బదిలీలు
- అదనపు టీచర్ల పేరుతో హడావుడి
- సేవాలాల్ బంజారాభవన్ వద్ద ధర్నా

పసిపాపతో ధర్నాలో పాల్గొన్న మహిళా ఉపాధ్యాయురాలు

హైదరాబాద్, జూలై 9 (నమస్తే తెలంగాణ): సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో పనిచేస్తున్న సీనియర్ ఉపాధ్యాయులు మంగళవారం మెరుపు ధర్నాకు దిగారు. ఈ విద్యాసంస్థల్లో అవసరానికి మించి ఉపాధ్యాయులు పనిచేస్తున్నారనే కారణంతో సీనియర్ ఉపాధ్యాయులను అదనపు ఉపాధ్యాయులుగా గుర్తించి అర్ధరాత్రి హడావుడిగా బదిలీ చేసినందుకు నిరసనగా హైదరాబాద్ సేవాలాల్ బంజారాభవన్ వద్ద ఈ ఆందోళన చేపట్టారు. సొసైటీ కార్యదర్శి సీనియర్ ఉపాధ్యాయులను అదనపు ఉపాధ్యాయులుగా గుర్తించి హడావుడిగా బదిలీకి ఆదేశాలు ఇవ్వడాన్ని టీఎస్‌యూటీఎఫ్ తీవ్రంగా ఖండించింది. రేషనలైజేషన్ నిబంధనల ప్రకారం అదనపు ఉపాధ్యాయులను బదిలీ చేయాల్సిన సందర్భంలో సీనియర్ల అంగీకారం తీసుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ అధ్యక్షుడు జంగయ్య, ప్రధాన కార్యదర్శి రవి తెలిపారు. బలవంతంగా బదిలీ చేయాల్సి వస్తే జూనియర్లను మాత్రమే బదిలీ చేయాలని, రాత్రి సీనియర్ టీచర్లతో జాబితా విడుదల చేసి తెల్లారేసరికి కౌన్సెలింగ్‌కు రావాలని పిలవడం సమంజసం కాదని పేర్కొన్నారు. అదనపు ఉపాధ్యాయులను సర్దుబాటు చేసే సందర్భంలో రీ డిప్లాయ్‌మెంట్ నిబంధనలు పాటించి సీనియర్ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాల నుంచి వచ్చిన ఉపాధ్యాయులు తీవ్ర నిరసన తెలిపారు.

ఇంటర్‌లో బదిలీలు!

హైదరాబాద్, జూలై 9 (నమస్తే తెలంగాణ): ఇంటర్ విద్యా కమిషనరేట్ పరిధిలోని ఉద్యోగుల బదిలీలకు రంగం సిద్ధమైంది. 700కుపైగా జూనియర్ లెక్చరర్లు, 350 మంది ప్రిన్సిపాళ్లు, 450 మంది బోధనేతర సిబ్బంది బదిలీ అయ్యే అవకాశాలున్నాయి. మార్గదర్శకాలను విద్యాశాఖ ఒకటి, రెండు రోజుల్లో విడుదల చేయనుంది. బదిలీల్లో జీరో సర్వీస్‌ను పరిగణనలోకి తీసుకోబోమని అధికారులు పేర్కొంటున్నారు. నిరుడు మేలో కాంట్రాక్ట్ లెక్చరర్లను క్రమబద్ధీకరించగా, వీరి సర్వీసు ఏడాది మాత్రమే పూర్తయ్యింది. దీంతో వీరికి తాజా బదిలీల్లో అవకాశం కల్పించబోమని చెప్పారు. వీరితో పాటు 447 మంది వీఆర్‌వోలను ఇంటర్‌బోర్డులో విలీనం చేశారు. వీరికి సైతం తాజా బదిలీల్లో అవకాశం కల్పించబోమని అధికారులు తెలిపారు.

విద్యుత్తు సంస్థల్లో పదోన్నతులు నో!

హైదరాబాద్, జూలై 9 (నమస్తే తెలంగాణ) : పోస్టులున్నా..పదోన్నతులు పొందలేని పరిస్థితి విద్యుత్తు సంస్థల్లో నెలకొంది. ఇంజినీర్లు, ఉద్యోగులు ప్రమోషన్ లేకుండానే పదవీ విరమణ పొందుతున్నారు. అధికారిక సమాచారం ప్రకారం.. టీజీఎస్పీడీసీఎల్ పరిధిలో మూడు సీజీఎం పోస్టులు ఏడేండ్లుగా ఖాళీగా ఉన్నాయి. దీంట్లో రెండు టెక్నికల్, ఒక అకౌంట్స్ పోస్టు ఉన్నాయి. ఐదు సూపరింటెండెంట్ పోస్టులు (ఎస్‌ఈ),13 డివిజినల్ ఇంజినీర్, 28 అసిస్టెంట్ డివిజినల్ ఇంజినీర్, 40 వరకు ఏఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటికి ఇన్‌చార్జిలను నియమించి కాలం వెల్లదీస్తున్నారు. కోర్టుకేసు తేలినరోజు రివర్షన్ ఇస్తామన్న షరతుతోనైనా పదోన్నతులివ్వాలని ఇంజినీర్లు కోరుతున్నారు.

నేటి నుంచి రైతుభరోసా సదస్సులు

- ఉమ్మడి జిల్లాలవారీగా 23 వరకు నిర్వహణ
- రైతుల అభిప్రాయాల సేకరణ
- ఆ తరువాత క్యాబినెట్ సబ్ కమిటీ నివేదిక
- పెట్టుబడి సాయం మరింత ఆలస్యం
- ఉద్దేశపూర్వకంగానే ప్రభుత్వం జాప్యం చేస్తున్నన్నదని విమర్శ

హైదరాబాద్, జులై 9(నమస్తే తెలంగాణ): రైతుభరోసాకు విధివిధానాలు రూపొందించేందుకు కసరత్తు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలవారీగా సదస్సులు నిర్వహించి, రైతుల అభిప్రాయాలు స్వీకరించాలని నిర్ణయించింది. బుధవారం నుంచి ప్రారంభం ప్రారంభం కానున్న ఈ సదస్సులు ఈ నెల 23 వరకు కొనసాగనున్నాయి. ఈ మేరకు రైతుభరోసాపై సూచనలు ఇచ్చేందుకు ఏర్పాటైన క్యాబినెట్ సబ్ కమిటీ ప్రణాళిక రూపొందించింది. వాస్తవానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలో ఏర్పాటైన క్యాబినెట్ సబ్ కమిటీ ఈ నెల 15లోగా ప్రభుత్వానికి నివేదిక అందజేయాల్సి ఉన్నది. కమిటీ నివేదికపై అసెంబ్లీలో చర్చించి, విధి విధానాలు ఖరారు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే ప్రకటించారు. ఈ నెల 23 వరకు జిల్లాలవారీ సదస్సులకు షెడ్యూల్ నిర్ణయించడంతో ఈ నెల 15లో క్యాబినెట్ సబ్ కమిటీ నివేదిక సమర్పించే అవకాశం కనిపించడం లేదు. దీంతో వానకాలం రైతుభరోసా (రైతుబంధు) పెట్టుబడి సాయం పంపిణీ మరింత జాప్యమయ్యే అవకాశం కనిపిస్తున్నది. కనీసం కోతల సమయానికైనా పెట్టుబడి సాయం అందుతుందా? లేదా? అనే సందేహం కలుగుతున్నది. కమిటీలు, సదస్సులు, చర్చల పేరుతో ప్రభుత్వం కాలయాపన చేస్తున్నదనే విమర్శలొస్తున్నాయి.

అసెంబ్లీలో చర్చ జరిగేనా...?

రైతుభరోసా నిబంధనలపై రైతులతో చర్చించడంతోపాటు అసెంబ్లీలోనూ చర్చకు పెడతామని సీఎం రేవంత్‌రెడ్డితోపాటు పలువురు మంత్రులు పలుమార్లు వెల్లడించారు. అయితే అసెంబ్లీలో రైతుభరోసాపై చర్చ జరుగుతుందా? లేదా? అనే అనుమానాలు కలుగుతున్నాయి. పార్లమెంట్‌లో ఈ నెల 23న కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టనున్నది. అనంతరం ఈ నెల 24 లేదా 25న రాష్ట్ర బడ్జెట్ పెట్టే అవకాశం ఉన్నది. ఈ నేపథ్యంలో అసెంబ్లీ సమావేశాలు 22 లేదా 23 నుంచి ప్రారంభమయ్యే అవకాశం ఉన్నది. కాగా, 23 వరకు సబ్ కమిటీ జిల్లాల్లో సదస్సులు నిర్వహించి రైతుల అభిప్రాయాలు తీసుకోనున్నది. రైతుల అభిప్రాయాలను క్రోడీకరించి కమిటీ నివేదిక రూపొందించాల్సి ఉంటుంది. కమిటీ తన నివేదికను తయారు చేసేందుకు కనీసం నాలుగైదు రోజులు పడుతుంది. దానిని ప్రభుత్వానికి ఇవ్వడానికి వారమైనా పడుతుంది. ఆలోపు అసెంబ్లీ సమావేశాలు పూర్తయ్యే అవకాశం ఉన్నది. ఈ నేపథ్యంలో అసలు రైతుభరోసా అంశం అసెంబ్లీలో చర్చకు వస్తుందా? లేదా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయి. రైతుభరోసా ఎవరికి ఇస్తారో, ఎన్ని ఎకరాల వరకు ఇస్తారో, ఎంత మంది రైతులకు, ఎంత మొత్తం ఇస్తారో అనే అంశాలపై స్పష్టత రాలేదు. తద్వారా అసలు రైతుభరోసాకు ఎన్ని నిధులు ఏ ప్రాతిపదికన కేటాయిస్తారనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.

ఇప్పటికే రైతుల అభిప్రాయ సేకరణ... మళ్లీ కమిటీ కాలయాపనకేనా...?

రైతుభరోసా పంపిణీపై ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేస్తున్నదనే వాదనలు వినిపిస్తున్నాయి. అసలు రైతుభరోసాపై కమిటీ వేయాల్సిన అవసరం ఏమిటనే ప్రశ్న మొదటగా ఉత్పన్నమవుతున్నది. ఇప్పటికే వ్యవసాయ శాఖ 'రైతునేస్తం' పేరుతో సమావేశాలు నిర్వహించి రైతుభరోసా నిబంధనలపై రైతుల అభిప్రాయాలను తీసుకున్నది. ఈ కార్యక్రమంలో స్వయంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని రైతుల అభిప్రాయాలు తీసుకున్నారు. పలు జిల్లాల్లో కలెక్టర్లు సైతం పాల్గొన్నారు. ఏఈవోలు సైతం రైతుల అభిప్రాయాలను తీసుకున్నారు. ఐదు ఎకరాల వరకు మాత్రమే పెట్టుబడి సాయం ఇవ్వాలని కొందరు రైతులు, 10 ఎకరాల వరకు ఇవ్వాలని మరికొందరు రైతులు అభిప్రాయపడ్డారు. ఐటీ (ఆదాయపన్ను) చెల్లించే వారికి కూడా రైతుభరోసా ఇవ్వాలని రైతులందరూ డిమాండ్ చేశారు. ఈ అభిప్రాయాలతో రైతుభరోసాలో ఎలాంటి నిబంధనలు పెట్టాలనే అంశంపై ప్రభుత్వానికి ఒక స్పష్టమైన నివేదిక కూడా వచ్చింది. ఇలాంటి పరిస్థితుల్లో మళ్లీ సదస్సులు నిర్వహించి అభిప్రాయాలు తీసుకోవాల్సిన అవసరం ఏమిటనే ప్రశ్న వినిపిస్తున్నది.

పంచాయతీరాజ్‌లో బదిలీలకు కమిటీ

హైదరాబాద్, జూలై 9 (నమస్తే తెలంగాణ): పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం నాలుగు రకాల కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ నెల 20లోగా ఉద్యోగుల బదిలీలను పూర్తి చేయాల్సి ఉండడంతో జిల్లా అధికారులు సీనియార్టీ జాబితాను రాష్ట్ర పంచాయతీరాజ్ కార్యాలయానికి పంపించారు. బదిలీల కోసం రాష్ట్ర స్థాయి, మల్టీ జోనల్, జోనల్, జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేశారు. పంచాయతీరాజ్‌శాఖలో లోక్‌సభ ఎన్నికలకు ముందు భారీగా బదిలీలు జరిగాయి. సాధారణ బదిలీల్లో అవకాశం కల్పించాలని, ఎంపీడీవోలు, అధికారులు కోరుతున్నారు. ఎన్నికల నిబంధనతో ఎక్కడికో బదిలీ అయ్యామని, మినహాయింపు ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 317 జీవో బాధిత ఉద్యోగులు సాధారణ బదిలీల్లో తమకు అవకాశం రావడంలేదని, తమకు కూడా అవకాశం కల్పించాలని కోరుతున్నారు. ప్రభుత్వం నుంచి మాత్రం సానుకూల స్పందన లేదని ఉద్యోగులు, అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పీఎస్ హెచ్‌ఎం పోస్టులను మంజూరుచేయాలి

హైదరాబాద్, జూలై 9 (నమస్తే తెలంగాణ): సీఎం హామీ ఇచ్చినట్టు పది వేల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయ (పీఎస్ హెచ్‌ఎం) పోస్టులను మంజూరు చేయాలని పీఆర్టీయూ టీఎస్ ప్రభుత్వాన్ని కోరింది. జీవో నెంబర్ -11, 12ను సవరించి, బీఈడీ అర్హత గల ఉపాధ్యాయులకు పీఎస్ హెచ్‌ఎంగా పదోన్నతులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శుల సమావేశాన్ని సోమ, మంగళవారాల్లో నిర్వహించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు తదితరులు పలు అంశాలపై చర్చించి, తీర్మానాలు చేశారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను విడుదల చేయాలని, పీఆర్సీలో 50శాతం ఫిట్‌మెంట్‌ను వర్తింపజేయాలని, సీపీఎస్ రద్దుచేయాలని, 2003 డీఎస్సీ టీచర్లకు పాత పెన్షన్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీలు మోహన్‌రెడ్డి, రవీందర్, మాజీ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, పత్రిక సంపాదకుడు ఇన్నారెడ్డి, 31 జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆర్టీసీకి ఉద్యోగులకు ఆరోగ్య పరీక్షలు

హైదరాబాద్, జూలై 9, (నమస్తే తెలంగాణ) : టీజీఎస్‌ఆర్టీసీకి ఉద్యోగులకు 'గ్రాండ్ హెల్త్ చాలెంజ్' ద్వారా ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్టు ఎండీ వీసీ సజ్జనార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి ఉద్యోగికీ పరీక్షలు నిర్వహించి, హెల్త్ ప్రొఫైల్ రూపొందించడమే 'గ్రాండ్ హెల్త్ చాలెంజ్' ఉద్దేశమని తెలిపారు. నవంబర్ 2022లో గ్రాండ్ హెల్త్ చాలెంజ్-1ను నిర్వహించి 47 వేల మందికి వైద్య పరీక్షలు చేసిందని, గుండె జబ్బుతో బాధపడుతున్న 300 మందికి వైద్యం అందించినట్టు గుర్తు చేశారు. గ్రాండ్ హెల్త్ చాలెంజ్ -2ను ఏప్రిల్ 18 నుంచి ప్రారంభించామని తెలిపారు. 97 డిపోల్లో క్యాంపులను ఏర్పాటు చేసి 45 వేల సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు చేసి, రిపోర్టులను మొబైల్ ఫోన్లకు పంపించారన్నారు.

గ్రామానికో రెవెన్యూ ఉద్యోగి!

- ధరణి పోర్టల్, ఆర్వోఆర్ చట్టానికి సవరణలు చేస్తాం
- రెవెన్యూ మంత్రి పొంగులేటి

హైదరాబాద్, జూలై 9 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక రెవెన్యూ అధికారి ఉండాలన్నదే లక్ష్యమని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మీడియాతో చిట్‌చాట్ నిర్వహించిన ఆయన.. రైతులు సులభంగా దరఖాస్తు చేసేలా ధరణి పోర్టల్‌లో మార్పులు చేస్తామని చెప్పారు. ధరణి పెండింగ్ దరఖాస్తులు 2.45 లక్షలు ఉండేవని, తర్వాత మరో లక్ష దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. స్లాట్ రద్దు చేసుకున్నవారికి ఆరు నెలల్లోగా డబ్బులు వచ్చేలా మార్పులు చేస్తామని తెలిపారు. భూముల విలువ సవరణపై కసరత్తు జరుగుతున్నదని, ఎల్‌ఆర్‌ఎస్‌ను క్లియర్ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. జీవో 59 కింద అక్రమాలు జరిగినట్టు దృష్టికి వచ్చిందని, అందుకే వాటి రిజిస్ట్రేషన్లు నిలిపివేశామని వివరించారు. 100 గజాలలోపు స్థలాలకు రిజిస్ట్రేషన్ చేయాలని ఆదేశాలు ఇచ్చామని వెల్లడించారు. ఆదాయం వస్తున్న 36 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు కార్పొరేట్ కంపెనీల సీఎస్‌ఆర్ నిధులతో భవనాలు నిర్మించి, నిర్వహణ సైతం వాటికే అప్పగిస్తామని తెలిపారు. రుణమాఫీ కోసం రూ.31 వేల కోట్లకన్నా ఎక్కువే ఖర్చయ్యే అవకాశం ఉన్నదని చెప్పారు. ఇప్పటికే రూ.9 వేల కోట్లు సమీకరించామని, మిగతావి ఇతర మార్గాల్లో సమకూర్చుకుంటామని వెల్లడించారు. రైతుభరోసాపై అభిప్రాయ సేకరణ ఖమ్మం నుంచి మొదలుపెడుతున్నామని అన్నారు. శ్రావణపల్లి గనిలో బొగ్గు నాణ్యత తక్కువగా ఉన్నట్టు నివేదికలు అందుతున్నాయని తెలిపారు. కమర్షియల్, ఆఫీస్ స్పేస్ లీజు పెరిగిందని, ఇండ్ల అమ్మకం పెరగలేదని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్లపై అధ్యయనం కోసం ఇప్పటికే యూపీ, ఏపీకి అధికారులు వెళ్లి వచ్చారని వివరించారు. డబుల్ బెడ్రూం ఇండ్లలో తక్కువఖర్చు అయ్యేవాటిని పూర్తి చేసి నిరుపేదలకు అందిస్తామని, రాజీవ్ స్వగృహ ఇండ్ల ధరలను సమీక్షించేందుకు ఇటీవలే కమిటీ వేశామని చెప్పారు. పెన్షన్ల పెంపునకు సంబంధించి ఈ బడ్జెట్‌లో నిధులు పెట్టే అవకాశం ఉన్నదని, లబ్ధిదారుల జాబితాను సమీక్షించాల్సిన అవసరం ఉన్నదని వెల్లడించారు. తమ ప్రభుత్వం స్థిరంగా ఉందనే భావన వచ్చే వరకు ఎమ్మెల్యేల చేరికలు కొనసాగుతాయని పేర్కొన్నారు.